క్లుప్తంగా

కాంగ్రెస్‌లో చేరిన మాజీ ఎంపీటీసీ, సర్పంచ్



కమ్మర్‌పల్లి(భీమ్‌గల్): భీమ్‌గల్ మండలం పురానిపేట్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ తోట శంకర్, సికింద్రాపూర్ మాజీ ఎంపీటీసీ కుర్ర గణేష్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆదివారం మోర్తాడ్ ప్రజానిలయంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డి సమక్షంలో తమ అనుచరులతో కలిసి చేరగా, ఆయన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈకార్యక్రమంలో నాయకులు కన్నె సురేందర్ పాల్గొన్నారు.

16న సీఐటీయూ జిల్లా మహాసభలు



నవీపేట: ఈనెల 16న సీఐటీయూ 5వ జిల్లా మహాసభలను జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు నాయక్ వాడి శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అసంఘటిత కార్మికుల సంక్షేమానికి సీఐటీయూ ప్రత్యేక కృషి చేసిందన్నారు.కార్యక్రమంలో నాయకులు ఆంజనేయులు, క్రిస్టఫర్, సాయమ్మ, దేవకి తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



రుద్రూర్ : ఈ నెల 24, 25 తేదీల్లో మహబూబాబాద్ జిల్లాలో నిర్వహించే తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఐదో మహాసభలను జయప్రదం చేయాలని యూనియన్ జిల్లా కార్యదర్శి జంగం గంగాధర్ పిలుపునిచ్చారు. రుద్రూర్‌లో ఆదివారం యూనియన్ రాష్ట్ర ఐదో మహాసభలకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీపీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గతంలో ఎన్నో సమస్యలు పరిష్కరించుకున్నామని గుర్తు చేశారు. ఈకార్యక్రమంలో జీపీ వర్కర్స్ మండల అధ్యక్షుడు మచ్చూరి అశోక్, కృష్ణ, శంకర్, సాయిలు, సతీష్, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాన్ని విమర్శించడం సరికాదు



బోధన్‌టౌన్(బోధన్): రాష్ట్ర ప్రభుత్వాన్ని బోధన్ మాజీ ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ ఆమేర్ విమర్శించడం సరికాదని డీసీసీ గెలిగేట్ గంగా శంకర్, పట్టణ అధ్యక్షులు పాషా మొయినొద్దీన్ అన్నారు. ఆదివారం పట్టణంలో కాంగ్రెస్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. ఇటీవల వరదలకు సాలూర మండలంలోని హున్సా, మందర్నా, ఖాజాపూర్ గ్రామాల్లో ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి పర్యటించి వ్యవసాయ అధికారులతో పంట నష్టం అంచనా వేయించారన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి కృషి చేస్తున్నారని, మరోసారి మాజీ ఎమ్మెల్యే ప్రభుత్వాన్ని, కాంగ్రెస్ పార్టీని విమర్శిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈసమావేశంలో మండల అధ్యక్షులు నాగేశ్వర్‌రావ్, ఏఎంసీ చైర్మన్ శీల శంకర్, నాయకులు ఇల్తెపు శంకర్, శరత్ రెడ్డి, గణపతి రెడ్డి, మందర్న రవి, దాము, యుజవన కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు తలారి నవీన్, ప్రమోద్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి మహిళా అంతర్గత శక్తిని తెలుసుకోవాలి



రుద్రూర్: ప్రతి మహిళా తన అంతర్గత శక్తిని తెలుసుకోవాలని సీనియర్ పిరమిడ్ మాస్టర్ శోభారాణి అన్నారు. మండల కేంద్రంలోని యోగా భవనాన్ని ఆదివారం ఆమె సందర్శించారు. అనంతరం యోగా కేంద్రం ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... ఆత్మ జ్ఞాన సందేశాన్ని వివరించారు. పతంజలి యోగ సమితి సభ్యులు కేవి మోహన్, సతీష్ గౌడ్, మహిపాల్, లింగం, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

పూర్తి కాని ఆస్పత్రి భవన నిర్మాణం

- భీమ్‌గల్‌లో వంద పడకల ఆస్పత్రి నిర్మాణానికి రూ.35 కోట్లకు రూ.13 కోట్ల చెల్లింపులు
- తుది దశలో ఆగిన పనులు
- త్వరగా పూర్తి చేయాలని స్థానికుల వినతి



నిర్మాణంలో ఉన్న భీమ్‌గల్ వంద పడకల ఆస్పత్రి భవనం

మోర్తాడ్: భీమ్‌గల్ పట్టణంతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందించాలనే ఉద్దేశ్యంతో చేపట్టిన వంద పడకల ఆస్పత్రి భవన నిర్మాణం పనులు పూర్తి కావడం లేదు. 2022లో రూ.35కోట్ల నిధులు మంజూరు కావడంతో అప్పటి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. భవన నిర్మాణం 80 శాతం వరకూ పూర్తయినా రూ.13 కోట్ల చెల్లింపులే జరిగాయి.చెల్లింపులు జరుగకపోవడంతో భవన నిర్మాణం చివరి దశ పనులు సాగడం లేదు. భీమ్‌గల్‌లో అధునాతన వైద్యం అన్ని రకాల వైద్య సేవలను అందించాలనే సంకల్పంతో వంద పడకల ఆస్పత్రికి ఏర్పాటు చేశారు. దూర భారంతో పాటు సరైన రవాణా సౌకర్యం లేకపోవడంతో ప్రైవేటు ఆస్పత్రులనే ఆశ్రయిస్తున్నారు. ఇక్కడ ఆస్పత్రి భవనానికి శంకుస్థాపన చేసిన తరువాత వైద్య విధాన పరిషత్ ద్వారా వైద్యులు, సిబ్బంది పోస్టులను మంజూరు చేశారు. భవనం అందుబాటులో లేకపోవడంతో ఇక్కడి వైద్యులు, సిబ్బంది మోర్తాడ్, ధర్పల్లి, బాల్కొండ, ఆర్మూర్ తదితర ఆస్పత్రులలో డిప్యూటేషన్‌పై పని చేస్తున్నారు. ఆస్పత్రి భవన నిర్మాణం మొదలు పెట్టి మూడేళ్లు అవుతున్నా పూర్తి కాకపోవడంపై ప్రజలు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి ప్రజలు మెరుగైన వైద్యంను అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

చిన్నచిన్న పనులు సాగుతున్నాయి

బిల్లుల చెల్లింపులు నిలచిపోవడంతో చిన్న చిన్న పనులు చేయిస్తున్నాం. ఇప్పటి వరకూ పూర్తయినా పనులకు బిల్లులు మంజూరైతే పనులు వెంటనే పూర్తి అవుతాయి. ప్రభుత్వానికి బిల్లుల చెల్లింపులకు సంబంధించిన నివేదికను పంపించాం.

– అరవింద్, జేఈ, వైద్యాఆరోగ్య శాఖ ఇంజినీరింగ్ విభాగం

ప్రమాదంలో వెల్మల్–ఆలూర్ బ్రిడ్జి

- కట్ట తెగి బ్రిడ్జి కూలిపోతుందని వాహనదారుల్లో ఆందోళన
- మరమ్మతులు చేయించాలని వాహనదారుల వినతి



కోతకు గురైన వెల్మల్–ఆలూర్ బ్రిడ్జి కట్ట

నందిపేట్(ఆర్మూర్): నందిపేట మండలంలోని వెల్మల్–ఆలూర్ గ్రామాల మధ్య నిర్మించిన బ్రిడ్జి ప్రమాదస్థాయికి చేరుకుంది. బ్రిడ్జికి అనుకుని పోసిన మొరం చిన్నపాటి వర్షానికి కోతకు గురవుతుంది. అలాగే బ్రిడ్జి ఎక్కేందుకు పోసిన మట్టి కొట్టుకుపోవడంతో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. గుంతల్లో నుంచి ప్రయాణం చేస్తూ వాహనదారులు ప్రమాదానికి గురవుతున్నారు. బ్రిడ్జి నిర్మాణం రోడ్డుకు అతి ఎత్తుగా నిర్మించడంతో రోడ్డు సమాంతరంగా ప్రయాణం చేసేందుకు గాను పక్కన మొరం పోశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మొరం కొట్టుకుపోయి కోతకు గురైంది. ఎక్కడా కట్ట తెగి బ్రిడ్జి కూలిపోతుందోనని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు జరిపించాలని కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి

గత సంవత్సరం సైతం ఇలాగే బ్రిడ్జికి అనుకుని ఉన్న మొరం కోతకు గురైంది. అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేయించి వదిలేశారు. ఈసమస్య ప్రస్తుతం మరింత తీవ్రంగా ఉంది. గుంతలలో ప్రయాణం చేయాలంటేనే భయం కలుగుతుంది. అధికారులు స్పందించి శాశ్వతమైన పరిష్కారాన్ని చూపాలి.

– దారం సురేశ్, వెల్మల్ గ్రామం

పనులు పూర్తి కాలేదు

వెల్మల్, ఆలూర్ గ్రామాల మధ్య గల బ్రిడ్జితో పాటు మండలంలోని మరికొన్ని బ్రిడ్జిల పనులు పూర్తిస్థాయిలో కాలేవు. పనులు తిరిగి చేపట్టి పూర్తి చేస్తాం. వర్షాలకు మొరం కోతకు గురయితే ప్రస్తుతానికి మరమ్మతులు చేపడుతాం. తర్వాత శాశ్వత పరిష్కార దిశగా పనులు చేపడుతాం.

– రఘు, ఆర్‌అండ్‌బీ ఏఈ, నందిపేట

ఐకమత్యంతోనే పద్మశాలీల అభివృద్ధి

- బీసీలకు రాజ్యాధికారమే లక్ష్యంగా ప్రత్యక్ష ఎన్నికల్లోకి..
- ఈఆర్ ఫౌండేషన్ ఛైర్మన్ ఈరవత్రి రాజశేఖర్
- ఆర్మూర్‌లో పద్మశాలీల అలయ్ బలయ్



మాట్లాడుతున్న ఈరవత్రి రాజశేఖర్



అలయ్ బలయ్‌లో పాల్గొన్న పద్మశాలి కులస్తులు

ఆర్మూర్: ఐకమత్యంతోనే పద్మశాలీల అభివృద్ధి సాధ్యమని ఈఆర్ ఫౌండేషన్ చైర్మన్, చార్టర్డ్ అకౌంటెంట్ ఈరవత్రి రాజశేఖర్ అన్నారు. పట్టణంలో పట్టణ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో అలయ్ బలయ్ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షులు మ్యాక మోహన్ దాస్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఈఆర్ ఫౌండేషన్ చైర్మన్ ఈరవత్రి రాజశేఖర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుత రాజకీయాల్లో అవకాశాలు వస్తున్నందున రాజకీయ రంగంలో పద్మశాలీలు ముందడుగు వేయాలన్నారు. గెలిచే సత్తా ఉన్న పద్మశాలీలకు ఎన్నికల్లో కుల సభ్యులు అండగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈవేదిక నుంచే బీసీలకు రాజ్యాధికారమే లక్ష్యంగా తాను ప్రత్యక్ష ఎన్నికల్లోకి వస్తున్నానని, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీసీల ప్రతినిధిగా పోటీలో నిలుస్తానని ఈరవత్రి రాజశేఖర్ ప్రకటించారు. తన రాజకీయ రంగ ప్రవేశాన్ని ఆయన ప్రకటించడం చర్చనీయాంశమైంది. ఈఆర్ ఫౌండేషన్‌ను స్థాపించి విస్తృతంగా సేవా కార్యక్రమాలను ఆయన నిర్వహిస్తున్నారు. ఆర్మూర్ నియోజకవర్గ ప్రజలకు న్యాయం చేసే పార్టీని ఎంచుకొని నిర్ణయం తీసుకుంటామన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, ఓసీల్లోని మిత్రులతో కలిసి పని చేస్తానన్నారు. రాజకీయాల్లో శాశ్వత మిత్రులు, శాశ్వత శత్రువులు ఉండరని, తన రాజకీయ రంగ ప్రవేశాన్ని పర్సనల్‌గా తీసుకోకుండా ఒక ఉద్యమంలా తీసుకొని ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులను, ఇంజినీరింగ్, ఎంబీబీఎస్ లో సీట్లు సాధించిన, నృత్యంలో ప్రతిభ కనబరిచిన వారిని ఘనంగా సత్కరించారు. బతుకమ్మ పోటీలకు హాజరైన మహిళలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పట్టణ పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి కొక్కుల రమాకాంత్, కోశాధికారి బత్తుల భాస్కర్, ఉపాధ్యక్షులు ఘణపురం సంతోష్ కుమార్, ప్రోగ్రాం కన్వీనర్ కొక్కుల విద్యాసాగర్, సర్వసమాజ్ ప్రతినిధి ఎలిగేటి చక్రధర్, తర్ప సంఘాల అధ్యక్షులు అంబటి కృష్ణహరి, బండి అనంత్ రావు, రుద్ర రాజేశ్వర్, సైబ సుధాకర్, వేముల ప్రకాష్, సదమస్తుల గణపతి, రాక్సీ రమేష్, జిందం నరహరి, మహిళ సంఘం ప్రెసిడెంట్ మ్యాక హేమలత, ప్రధాన కార్యదర్శి కొక్కుల వసంతలక్ష్మీ, కోశాధికారి ఈరవత్రి సునీత తదితరులు, పెర్కిట్ సంఘం ప్రెసిడెంట్ మానేటి లింబాద్రి, మండల సంఘం ప్రెసిడెంట్ బొడ్డు గంగాధర్, చెన్న రవి, రవికాక తదితరులు పాల్గొన్నారు.

గుంతలమయంగా మోస్రా రోడ్డు

- రోడ్డు పనులు పూర్తి చేయడంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



దుమ్ము లేస్తున్న మోస్రా రోడ్డు

వర్ని(మోస్రా): వర్ని– నిజామాబాద్ ప్రధాన రహదారిపై మోస్రా వద్ద రోడ్డు గుంతలమయంగా మారింది. గోవూరు శివారు నుంచి మోస్రా శివారు వరకు 2.7 కిలోమీటర్ల రోడ్డును రూ.5 కోట్ల వ్యయంతో పనులు చేపడుతున్నారు. గత ఐదు నెలలుగా రోడ్డు వెడల్పు పనులు చేపడుతున్న కాంట్రాక్టర్ పనులను పూర్తి చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. కంకర వేసి వదిలివేశారు. గుంతలకు తోడుగా వాహనాలు వెళ్లేటప్పుడు దుమ్ము లేవడంతో ముందు వచ్చే వాహనాలు కనబడక ప్రమాదాలు జరుగుతున్నాయి. మధ్యాహ్నమే లైట్లు వేసుకొని రావాల్సిన దుస్థితి నెలకొందని వాహనదారులు చెబుతున్నారు. నెలల తరబడి రోడ్డు పనులు చేయడంపై స్థానికులు మండిపడుతున్నారు. గుంతలను పూడ్చడం, రోడ్డుపై నీళ్లు చల్లడం వంటి పనులు చేయడంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వహిస్తున్నాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. రెండున్నర నెలల నుంచి గుంతల మూలంగా సుమారు 20 ప్రమాదాలు జరిగాయని మోస్రా గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గుంతలను పూడ్చాలని కాంట్రాక్టర్‌కు , అధికారులకు విన్నవించిన పట్టించుకోవడంలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నాతాధికారులు స్పందించాలని కోరుతున్నారు.

15 రోజుల్లో పనులు పూర్తి చేస్తాం

తరచూ వర్షాలు పడడంతో రోడ్డు పనులకు అంతరాయం ఏర్పడుతుంది. వర్షాలు పడే సమయంలో తారు రోడ్డు వేస్తే నాణ్యత లోపిస్తుందని వేయలేదు. 15 రోజుల్లో రోడ్డు పనులను పూర్తి చేస్తాం.

– బియాన్, ఆర్‌అండ్‌బీ ఏఈ, వర్ని

చర్చిలో యూత్ సండే



బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని రాకాసీపేట్‌లో గల హోలీ ట్రినిటీ చర్చిలో ఆదివారం యూత్ సండేను నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చి ఫాదర్ రెవరెండ్ రూబెన్ మాట్లాడారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. కమిటీ సభ్యులు అమృత్‌రావ్, స్వామిదాస్, ఆండ్రోస్, అశోక్, మల్లేష్, ఆకాష్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బోనాల పండుగ



రెంజర్లలో బోనాలతో వెళ్తున్న మహిళలు

బాల్కొండ/ నవీపేట : ముప్కాల్ మండలం రెంజర్ల గ్రామంలో, నవీపేట, తడగామ, ధర్యపూర్ వీడీసీ ల ఆధ్వర్యంలో గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. రెంజర్లలో కాలినడకన పవిత్ర గోదావరికి వెళ్లి గంగానీళ్లను తీసుకువచ్చారు. అనంతరం గ్రామ దేవతలకు జలాభిషేకం నిర్వహించారు. బోనాలతో ఊరేగింపు నిర్వహించి గ్రామదేవతలకు నైవేద్యాలు సమర్పించారు. కార్యక్రమంలో వీడీసీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

మాక్లూర్: మండల కేంద్రంలో ఆదివారం గ్రామస్తులు ఘనంగా మహాలక్ష్మి పండుగను నిర్వహించుకున్నారు. గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ పండుగలో అన్ని కులాలకు చెందిన ప్రజలు పెద్ద ఎత్తున బోనాలతో మహాలక్ష్మి, పోచమ్మ ఆలయాలకు ఊరేగింపుగా వెళ్లారు. అక్కడ ప్రత్యేక పూజలు అనంతరం వనభోజనాలు చేశారు. గ్రామాన్ని అన్ని విధాలుగా క్షేమంగా ఉండేటట్లు చూడాలని మహాలక్ష్మి ఆలయంలో పూజలు జరిపారు. పెద్ద ఎత్తున గ్రామస్తులు పాల్గొన్నారు.



మాక్లూర్‌లో ..



నవీపేటలో..

సంక్షిప్తం

ఎస్సీ బాలికల హాస్టల్ ఆవరణలో 'స్వచ్ఛ ఆర్మూర్'



ఆర్మూర్‌టౌన్: పట్టణంలో మహాత్మా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎస్సీ బాలికల వసతి గృహ ఆవరణలో ఆదివారం స్వచ్ఛ ఆర్మూర్ కార్యక్రమం నిర్వహించారు. హాస్టల్‌లో ఆవరణలో పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించి, పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు సుంకె శ్రీనివాస్ మాట్లాడుతూ..ప్రతి ఆదివారం ఒక గంట – స్వచ్ఛ ఆర్మూర్ కోసం అనే నినాదంతో శుభ్రతా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. హాస్టల్ వార్డెన్ సుమలత, సిబ్బంది , సభ్యులు నిశాంత్, ప్రశాంత్, రాజ్‌కుమార్, రాకేష్, సిబ్బంది, విద్యార్థినిలు పాల్గొన్నారు.

విద్యార్థికి సన్మానం

వేల్పూర్ : మండల కేంద్రానికి చెందిన జాబరాతి నవతేజ్ కాకతీయ మెడికల్ కాలేజీ లో సీటు సాధించడం తో స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు ఆదివారం శాలువాతో సన్మానించారు. తండ్రి చనిపోయినా పట్టుదల తో చదివి డాక్టర్ సీటు సాధించడం అభినందనీయమన్నారు. నాయకులు రెగుల్ల రాములు, పిట్ల సత్యం, బబ్బురు ప్రతాప్ రెడ్డి, దయాకర్, భోజన్న, మొండి అశోక్, కాంతయ్య పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన

వేల్పూర్: సీజేఐ బీఆర్ గవాయిపై షూ విసిరిన న్యాయవాదిని శిక్షించాలని పచ్చలనడుకుడ గ్రామంలో దళిత సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. నాయకులు రవి, ప్రతాప్, శంకర్, డేవిడ్, రాజు, ప్రశాంత్, రాకేష్, నెహ్రూ, మోహన్, గోపాల్, ప్రమోద్, శ్రీకాంత్ పాల్గొన్నారు

నేడు శివాలయంలో ప్రత్యేక పూజలు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్దుల గుట్టపై గల శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే స్వామివారి ఉత్సవ విగ్రహాలకు ఆలయ పరిసర ప్రాంతాల్లో పల్లకీసేవ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

స.హ. చట్టం ప్రజలకు బ్రహ్మాస్త్రం

ఆర్మూర్‌టౌన్: సమాచార హక్కు చట్టం ప్రజలకు బ్రహ్మాస్త్రం లాంటిదని సీనియర్ న్యాయవాది లోక భూపతిరెడ్డి అన్నారు. పట్టణంలోని ఆదివారం న్యాయవాద బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమాచారం హక్కు చట్టం జిల్లా కన్వీనర్, ప్రముఖ న్యాయవాది గటడి ఆనంద్‌కు అభినందించి సన్మానించారు.ఈ సందర్భంగా లోక భూపతిరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జక్కుల శ్రీధర్, జెస్సు అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఓయూ జేఏసీ నాయకుడికి మంత్రి వివేక్ పరామర్శ



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం సుర్బిర్యాల్ గ్రామంలో ఉస్మానియా యూనివర్సిటీ జేఏసీ నాయకుడు అంగరి ప్రదీప్‌ను రాష్ట్ర భూగర్భ గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి ఆదివారం పరామర్శించారు. సుర్బిర్యాల్‌కు చెందిన నాయకుడు ప్రదీప్ తల్లి లక్ష్మీ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ప్రదీప్‌తో పాటు కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అలాగే లక్ష్మీ చిత్ర పటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, ఉన్నత విద్యా మండలి మాజీ చైర్మన్ లింబాద్రి, మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య, నాయకులు గడుగు గంగాధర్, అలుక కిషన్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కు సునీల్‌రెడ్డి ..

కమ్మర్‌పల్లి(భీమ్‌గల్): భీమ్‌గల్ మండలం చేంగల్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ చిన్నారెడ్డిని కాంగ్రెస్ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డి పరామర్శించారు. చిన్నారెడ్డి కొడుకు వంశీ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో సునీల్‌రెడ్డి వాళ్లింటికి వెళ్లి పరామర్శించి, సానుభూతి వ్యక్తం చేశారు. నాయకులు కన్నె సురేందర్ తదితరులున్నారు.

త్వరలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తాం



భరత్‌రాజ్‌రెడ్డి

డొంకేశ్వర్(ఆర్మూర్): రైతులు సాగు చేసిన మక్క, సోయా పంటలను దళారులకు విక్రయించొద్దని డొంకేశ్వర్ సొసైటీ చైర్మన్ బార్ల భరత్‌రాజ్ రెడ్డి కోరారు. త్వరలోనే మండల కేంద్రంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మక్క, సోయా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఇటీవల జనరల్ బాడీ మీటింగ్‌లో తీర్మానం చేయగా, మార్క్‌ఫెడ్ డీఎంకు కూడా విన్నవించినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం వారంలోపు కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తుందన్నారు.

తరగతులకు కచ్చితంగా హాజరు కావాలి

- విద్యార్థులకు సూచిస్తున్న మోర్తాడ్ జూనియర్ కాలేజీ అధ్యాపకులు
- వార్షిక పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా కృషి



ఏర్గట్లలో విద్యార్థి ఇంటికి వెళ్లి సూచిస్తున్న అధ్యాపకులు

మోర్తాడ్: ఇంటర్ వార్షిక పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం ముందుకు సాగుతుంది. మోర్తాడ్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గంగాధర్, అధ్యాపకుల బృందం కళాశాల పరిధిలోని మోర్తాడ్, ఏర్గట్ల మండలాల్లో ఉన్న విద్యార్థుల ఇళ్లకు వెళ్లి హాజరు శాతం పెరిగేలా అవగాహన కల్పిస్తున్నారు. దసరా సెలవులు ముగిసినా విద్యార్థులు కాలేజీకి రాకపోవడంతో ఇటీవల ఇంటర్ విద్యాధికారి మోర్తాడ్ కళాశాలలో సమావేశాన్ని నిర్వహించి ప్రతి విద్యార్థి క్రమం తప్పకుండా తరగతులకు హాజరు అయ్యేలా చూడాలని సూచించారు. కళాశాలలో అన్ని గ్రూపులలో 350 మంది విద్యార్థులు ఉన్నారు. రెగ్యులర్‌గా 150 నుంచి 175 వరకే హాజరు అవుతున్నారు. అధ్యాపకులు విద్యార్థులను వారి తల్లితండ్రులను స్వయంగా కలిసి హాజరు శాతం పెరిగేలా కృషి చేస్తున్నారు. విద్యార్థులు రెగ్యులర్‌గా తరగతులకు హాజరు అయితేనే వంద శాతం ఉత్తీర్ణత సాధించడానికి అవకాశం ఉంది.

అందరూ కలిసి పనిచేయాలి



వర్ని: కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు వర్గాలను, గ్రూపులను పక్కనపెట్టి అందరూ కలిసికట్టుగా కాంగ్రెస్ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని వర్ని మార్కెట్ కమిటీ అధ్యక్షులు సురేశ్ బాబా పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని పాత వర్ని గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి వర్గీయులు స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని సూచించారు. ప్రకాష్ రావు, నగేష్, మొగులయ్య, మారుతి పాల్గొన్నారు.

ప్రాచీన రాతి కట్టడం వెలికితీసేందుకు ..



రుద్రూర్ రాజరాజేశ్వర స్వామి ఆలయం వద్ద కొనసాగుతున్న పనులు

రుద్రూర్ : మండల కేంద్రంలో కాకతీయుల కాలంలో రాజరాజేశ్వర మందిరం పూర్తిగా రాతి కట్టడంతో నిర్మించారు. కాలక్రమేణ పండుగల వేళ ఆలయ క మిటీ సభ్యులు సున్నం, పెయింటింగ్ వేయడంతో పురాతన వైభవం కనుమరుగైంది. ప్రాచీన కళను ఆలయానికి తీసుకురావాలనే ఉద్దేశంతో ప్రస్తుత ఆలయ కమిటీ అధ్యక్షుడు రామ్‌రాజ్ ఆధ్వర్యంలో పనులకు శ్రీకారం చుట్టారు. రాతి కట్టడంపై ఉన్న సున్నం తొలగిస్తున్నారు. ఇద్దరు కాంట్రాక్టర్లు మారారు. తొలుత వారం రోజుల్లో రాతి కట్టడం బయటకు తీస్తామని వచ్చిన కాంట్రాక్టర్ రెండు రోజులకు చేతులెత్తేశాడు. మరో కాంట్రాక్టర్ పనులు చేపట్టినప్పటికీ గతేడాది కాలంగా కొనసాగుతున్నాయి. మరో వారం రోజుల్లో పనులు పూర్తవుతాయని ఆలయ కమిటీ సభ్యులు వెల్లడించారు.